పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి సచివాలయం పరిధిలోని గుర్రాలమడుగు గ్రామంలో ఎంపీయూపీ స్కూల్‌ను ఎంపీడీవో ఈశ్వరమ్మ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, పిల్లల హాజరుశాతం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

కంభం: ఉగాది పండుగను పురస్కరించుకొని కాటంరాజు తిరునాళ్లకు వెళ్లే భక్తులకు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో భక్తుల దాహార్తి తీర్చడం కోసం ప్రతిఏటా మజ్జిగ పంపిణీ చేస్తామని సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జొన్నకూటి రామిరెడ్డి, చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, గొంగటి చెన్నారెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంటికి అక్రమ కుళాయి కనెక్షన్



అర్ధవీడు: గ్రామాల్లో కూటమి నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. వారు చేస్తున్న దౌర్జన్యాలను చూస్తూ అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారు. సామాన్య ప్రజలకు చిన్న పనులకు తిప్పుకునే పంచాయతీ అధికారులు అధికార పార్టీ నాయకులు ఏం చేసినా ముక్కున వేలేసుకుంటున్నారు. మండలంలోని మోహిద్దీన్‌పురం గ్రామంలో టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు నూతలపాటి భాస్కరరావు మంచినీటి బోరు నుంచి ట్యాంకుకు వెళ్లే మెయిన్‌పైపు లైనుకు మధ్యలో రంధ్రం వేసి తన ఇంటి వద్ద కుళాయి వేసుకున్నాడు. దీంతో ట్యాంకు వెళ్లే నీళ్ల ప్రవాహవేగం తగ్గిపోతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన పైపులైనుకు అక్రమంగా రంధ్రం వేసి తన ఇంటికి కుళాయి వేసుకున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంపై అధికారులకు వివరణ కోరినా ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ మాటదాట వేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా నిలబడదాం


నూతన మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు


పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

బేస్తవారిపేట: కూటమి నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా నిలబడదామని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వాల్మీకి నగర్‌లో నూతనంగా నియమితులైన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీధర్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే పూర్తి వ్యతిరేఖతను మూటకట్టుకుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోగా చిన్నపాటి ఉద్యోగులను తొలగించి పొట్టకొడుతుందన్నారు. ఆవుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. పదవి రావడానికి సహకరించిన జిల్లా ఒంగోలు పార్లమెంట్ నియోజవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, ఎంపీపీకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీధర్‌రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మల్లెల శేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు డీ ఖాజామీయా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి సారూ !


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

మార్కాపురం: గత 3 నెలలుగా జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారింది.. ఉగాది పండుగ కూడాచేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. మీరైనా అధికారులతో మాట్లాడి జీతాలు ఇప్పించాలని మార్కాపురం జీజీహెచ్‌లో కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 3 నెలలుగా జీతాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్నామని, జీతాలు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సుబ్రమణ్యం, సురేష్, పారిశుధ్య కార్మికులు కోరారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

పొదిలి:

పొదిలి ప్రాంత విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను ఉగాది, రంజాన్ పండుగలైనప్పటికీ విద్యుత్ కార్యాలయాలు తెరిచే ఉంటాయని, బిల్లులు చెల్లించాల్సిన వారు చెల్లించవచ్చని ఏడీఈ హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని వినియోగదారులు ఉపయోగించుకొని బిల్లులు చెల్లించాలని కోరారు.

నష్టపరిహారం అందజేత


చెక్కులు అందజేస్తున్న రేంజ్ ఆఫీసర్ వరప్రసాద్

మార్కాపురం టౌన్: మండలంలోని గొట్టిపడియ అటవీ ప్రాంతంలో ఇటీవల రేసు కుక్కలు చంపిన దూడల యజమానులకు శనివారం మార్కాపురం అటవీశాఖ అధికారి కార్యాలయంలో రేంజ్ ఆఫీసర్ వరప్రసాదు, డిప్యూటీ రేంజ్ ఆఫీసరు నాగరాజులు నష్టపరిహారం అందజేశారు. గుండంచర్ల గ్రామానికి చెందిన గోరంట్ల వెంకటరెడ్డికి రూ.46 వేలు, దూదేకుల మాబుకు రూ.23 వేల చెక్కులను అందజేశారు.

100 మంది ముస్లింలకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందజేస్తున్న సిరాజ్

మార్కాపురం: రంజాన్ పండుగను పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలో శనివారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సిరాజ్ 100 మంది పేద ముస్లిం మహిళలకు దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ పర్వదినం సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా దుస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

4న సర్వసభ్య సమావేశం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఎంపీడీఓ కార్యాయలంలో ఎంపీపీ కడప లక్ష్మీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 వ తేదిన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఆలయాల్లో భక్తుల సందడి

కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి వెంకటేశ్వరస్వామి, కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న ఉగాది కవి సమ్మేళనం



పేదలకు దుస్తులు అందజేస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: విశ్వావసు నామ సంవత్సర ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు, ఉషస్సులు నింపాలని ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి కోరారు. శనివారం రాత్రి ప్రెస్‌క్లబ్‌లో త్రివిక్రమ అభ్యుదయ కళాసంఘం ఆధ్వర్యంలో నిర్వసించిన ఉగాది కవి సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తీపి చేదుల కలయిక, కష్టసుఖాల సమ్మేళనాన్ని రుచిచూపేదే జీవితమని అన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన కవిసమ్మేళనంలో కవులు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి, కప్పగంతుల మధుసూదన్, ఓపీ మల్లిక్, ఎంవీ సుబ్బారావు, తోట శ్రీనివాసరావు తదితరులు ఉగాదిపై కవితలు వినిపించగా, ప్రముఖ గాయకులు పురాణం సుబ్రమణ్యం రాయప్రోలు వెంకటేశ్వర్లు తదితరులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి చిత్తారి రంగ నాయకులను జంకె వెంకటరెడ్డితో పాటు నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పేదలకు దుస్తులు అందచేశారు.

ఉత్సాహంగా ఉగాది సంబరాలు


బహుమతులు అందుకుంటున్న మహిళలు

గిద్దలూరు రూరల్: విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పట్టణంలోని గర్రెవారి వీధిలో ఉగాది సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగువారి మొదటి పండుగ ఉగాదితో ప్రారంభం అవుతుండటంతో వీధిలోని కాలనీవాసులందరూ కలిసిమెలసి పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు, లెమన్‌స్పూన్, కోలాటం వంటి క్రీడలను నిర్వహించి కేక్ కట్ చేశారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు రూ.1500, రూ.1000, రూ.500 బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సూరే నాగేశ్వరరావు, రామచంద్రుడు, బాదం వెంకటేశ్వర్లు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

హైవేలో ప్రమాదాలు నివారించాలని వినతి


వినతి పత్రం ఇస్తున్న చెన్నకేశవరావు

కంభం: పట్టణంలోని హైవే రోడ్డుపై రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అమరావతిలోని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు షెడ్యూల్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు తెలిపారు. అనంతపురం-అమరావతి హైవే రోడ్డులోని మలుపు ప్రమాదకరంగా మారిందని, ఆ ప్రాంతంలో అనేక ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలవుతున్నట్లు తెలిపారు. గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, రోడ్ సేఫ్టీ ఇంజినీర్ల ద్వారా తనిఖీ చేయించి సమస్యను పరిష్కరించేలా చూడాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా రోడ్డుకు ఇరువైపుల జరిగిన ఆక్రమణలపైనా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పాస్టర్ల భారీ ర్యాలీ

మార్కాపురం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై దర్యాప్తు చేపట్టి నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని మార్కాపురం డివిజన్ పాస్టర్స్ అసోషియేషన్, పట్టణ క్రైస్తవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పెగడాల మృతికి నిరసనగా శనివారం మార్కాపురం పట్టణంలో ర్యాలీని నిర్వహించి కోర్టు సెంటరులో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ల అధ్యక్షులు నందిగం ఫ్రాంక్లిన్, పులుకూరి ఆంధ్రూస్, ఎం ఏలియా, అమృత్ తేజ్, నిరీక్షణ్ తదితరులు మాట్లాడుతూ క్రైస్తవులు ఎప్పుడూ శాంతినే కోరుకుంటారన్నారు. పాస్టర్ ప్రవీణ్‌మృతిపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఈవోకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో పాస్టర్ విజయభాస్కర్, కౌన్సిలర్లు దేవకరుణమ్మ, ఉత్తమ్‌కుమార్, హర్షిత బాబి, రోజీలిడియా, అబ్రహాం, కాలేబు, చాట్ల డానియేల్, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. చెడు వ్యసనాలకు బానిసలై చెడుమార్గంలో పయనించే వారి జీవితాలు నాశనం అవుతాయన్నారు. రాజ్యాంగం ప్రకారం మనకు ఉన్న హక్కులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత, గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్, జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, న్యాయవాది పిచ్చయ్య, కోర్టు సిబ్బంది మధుసూదనరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో, కారు ఢీ


దెబ్బతిన్న ఆటో ముందుభాగం

మార్కాపురం టౌన్: ఆటో, కారు ఢీకొట్టుకోవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని దరిమడుగు వద్ద శనివారం ఉదయం జరిగింది. అందిన వివరాల మేరకు.. పెద్దారవీడు మండలం వైడీపాడుకు చెందిన గ్రామస్తులు ఆటోలో మార్కాపురం వస్తున్నారు. ఇదే సమయంలో మార్కాపురం నుంచి వెళ్తున్న కారు దరిమడుగు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవరు బలుసుపాటి గాలెయ్యతోపాటు ఆటోలో ఉన్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణపై శ్వేతపత్రం విడుదల చేయాలి


కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మార్కాపురం: ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం మరోసారి కమిషన్ నివేదికను పరిశీలించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల డానియేల్, జిల్లా కార్యదర్శి పి అనిల్‌కుమార్ కోరారు. శనివారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించి సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందించారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు రాజ్యాంగ పరమైన రిజర్వేషన్లు దక్కకుండా చేయడంతో మాదిగలు దండోర సంఘాన్ని స్థాపించి అనేక పోరాటాలు చేసి ఏబీసీడీ వర్గీకరణ చేయించుకున్నారన్నారు. అయితే ఇటీవల వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషను నివేదిక ఇచ్చిందని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని మంత్రి వర్గ ఉపసంఘం పున పరిశీలన చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని, మాదిగలకు సమాన రిజర్వేషన్లు అందేలా చూడాలని ఏపీ ఎమ్మార్పీఎస్ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెన్నయ్య, ఇశ్రాయేల్, స్టీవెన్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.